
# ట్రాఫిక్ జామ్




మామూలుగానే రాత్రి పదకొండింటివరకూ బోఫర్స్ కుంభకోణాల గురించీ, ఎన్టీఆర్, హెగ్డేల అవినీతి గురించీ సరదాగా కబుర్లు చెప్పుకుని అందరం ఎవరిళ్ళకు వాళ్ళు బయల్దేరాం. అప్పటికే ఆడాళ్ళంతా విసుక్కుంటున్నారు మా మీద.

"మీ అందరికీ పనీపాటా లేకుండాపోయింది. అక్కడికి మీరంతా నీతిపరులయినట్లు దేశంలోని కర్రప్షన్ గురించి ఊరికే హడావుడి పడిపోతున్నారు" అంది మా ఆవిడ.

నాకు వళ్లు మండిపోయింది.

"మేము అవినీతిపరులమా?" కోపంగా అడిగాను.

"అబ్బే– అవినీతంటే మీకేం తెలుసని? సిగ్గులేపోతేసరి" అంది శాయిరామ్ భార్య.

"మొన్నటికి మొన్న మీరు ఏదో ఫైల్ ఎవరికో అనుకూలంగా నోట్ రాసి పుటప్

చేసినందుగ్గాను ఆ పెద్దమనిషి ఓ ఎలక్ట్రానిక్ వాచీ ఇచ్చాడని తీసుకొచ్చారా లేదా?" జనార్ధన్ భార్య నిలదీసింది.

జనార్ధన్‌కి వళ్ళు మండిపోయింది. "అది వేరు! దాన్ని లంచం అనరు! గిఫ్ట్ అంటారు."

దాంతో రంగారెడ్డి భార్య విరుచుకుపడింది. "అలాగా! అయితే మరి మొన్న మావారు ఎవరిదో ఫైల్ పుటప్ చేయకుండా ఆలస్యం చేసినందుగ్గాను వాడెవడిదగ్గరో పార్టీ తీసుకోలేదా? దాన్నేమంటారు?" వెటకారంగా అడిగిందామె.

"మా వారూ ఏం తక్కువ కాదులెండి! మొన్న ఆ సన్మాన సంఘం వాళ్ళు ఎవరిదగ్గరో దబ్బు తీసుకుని చేసిన సన్మానం తాలూకు న్యూసూ, ఫోటోలు 'ఈక్షణం' పేపర్‌లో వేయించినందుకుగాను వాళ్ళిచ్చిన టేబుల్ ఫాన్ తీసుకున్నారా లేదా?"

గోపాల్‌రావ్ ముఖంలో కళ తగ్గిపోయింది.

"ఛట్ ఛట్ ఛట్! అది అవినీతెలా అవుతుంది. "పరస్పర సహాయం" అంటారు దానిని."

ఇంక వాగ్వివాదం కొనసాగితే పరువు పోయేట్లుందని యాదగిరి కయ్‌మని లేచాడు ఆడాళ్ళమీద.

"మీకేం దమా కున్నదా లేదా? మేమ్ తీసుకున్నాగానీ దాని వాల్యూ ఎంత? వంద లేక రెండొందలు! కాకుంటే నాల్గొందలు- మన నాయకుల్ తీస్కొనెడిది కోట్లు - దానికీ దీనికీ సంబంధమేమున్నది? పదండ్రి- అందు గురించే లేడీస్ దమాక్ దేడ్ దమాక్ అనెడిది"

ఆడాళ్ళంతా అతని మీద నిరసన తెలియజేసినా మొత్తానికి ఎవర్దారిన వాళ్ళు డిస్పర్స్ అయిపోయారు.

రాత్రి పన్నెండయింది. అప్పుడే నిద్రపడుతోంది నాకు.

అంతలోనే తలుపు దబదబ బాదిన చప్పుడు. మళ్ళీ ఎవడికి ఏం ముంచుకొచ్చిందా అనుకుంటూ వెళ్ళి తలుపు తెరచాను.

ఎదురుగ్గా రామచంద్రమూర్తిగారు నిలబడి వున్నారు విచారంగా. ఆయన మా కాలనీ వ్యక్తే కావటం వల్ల "ఏమిటి మాష్టారూ?" అనడిగాను.

దాంతో ఆయన భోరున ఏడ్చేయటం ప్రారంభించాడు. ఆ ఏడుపు వినడంతోనే క్షణాల్లో మా వాళ్ళంతా పరుగుతో వచ్చేశారు.

"ఏమిటి? ఏం జరిగింది? ఎన్‌టిఆర్ మళ్ళీ రిటైర్‌మెంట్ ఏజ్ తగ్గించాడా?" అనుమానంగా అడిగాడు రంగారెడ్డి. ఎందుకంటే మా కాలనీలో చాలామంది అదే భయంతో రోజులు గడుపుతున్నారు.

"అది కాదండీ- మా అమ్మాయ్ సంధ్యారాణి..."

మా గుండె ఝుల్లుమంది-

"ఆ! ఏమయిందా అమ్మాయికి?"

"ఉదయం తొమ్మిదిగంటలకు మామూలుగానే ఆఫీస్ కెళ్ళింది. ఇంతవరకూ తిరిగిరాలేదు-" అంటూ మళ్ళీ భోరుమన్నాడతను.

ఈలోగా వాళ్ళావిడ కూడా పెద్దగా ఏడుస్తూ వచ్చేసింది.

"మీరే మా అమ్మాయిని మాకు తెచ్చియ్యండి దేవుడో" అంటూ శాయిరామ్ కాళ్ళమీద పడిపోయింది. వాళ్ళిద్దరినీ ఓదార్చి సంధ్యారాణి ఏమయిపోయివుంటుందా అని డిస్కషన్ మొదలుపెట్టాం.

"మనదేశంలో వయసులో ఉన్న ఓ అమ్మాయి రాత్రి పన్నెండింటివరకూ ఇంటికి తిరిగిరాలేదంటే ఏమిటర్థం?" అడిగాడు రంగారెడ్డి.

"ఇంకేముంటుంది? తప్పకుండా రేప్‌కీ, మర్డర్‌కీ ఆహుతయిపోయి వుంటుంది" అన్నాడు గోపాల్రావ్.

అందరం వెంటనే గోపాల్రావ్ అభిప్రాయంతో ఏకీభవించక తప్పలేదు.

"అయితే మరిప్పుడేమిటి చేయటం?" అడిగాడు రంగారెడ్డి.

"మనం రెండు పార్టీలుగా విడిపోయి రెండు కార్యక్రమాలు చేపట్టాలి. మొదటి గ్రూప్ వాళ్ళు ఆమె శవం ఎక్కడయినా కనిపించిందేమో పోలీస్‌స్టేషన్స్‌లో ఎంక్వయిరీ చేయాలి. రెండో గ్రూప్ తెల్లారేసరికి ఆమె దహన సంస్కారానికి ఏర్పాట్లు చేయాలి." అన్నాడు శాయిరామ్.

ఆ మాట వింటూనే ఆమె తల్లిదండ్రులిద్దరూ విరుచుకుపడి పోయారు.

"అనుకున్నంతా అయింది దేవుడో! వద్దంటున్నా వినకుండా ఇవాళ బంగారు ఉంగరం కూడా పెట్టుకెళ్ళి ప్రాణం మీదకు తెచ్చుకుందిరా దేవుడో" అంటూ ఏడ్చేయసాగిందామె.

వాళ్ళిద్దరినీ మా ఆడాళ్ళందరూ కలిసి బలవంతంగా వాళ్ళింటికి తీసుకెళ్ళారు.

శాయిరామ్ గ్రూప్ వాళ్ళందరం ముందు పోలీస్ కంట్రోల్ రూమ్‌కి ఫోన్ చేయాలని నిర్ణయించుకుని మా కాలనీ దగ్గరలోనే ఉన్న హొటల్ ఓనర్‌ని నిద్రలేపి లోపలవున్న పబ్లిక్ టెలిఫోన్ బూత్ నుంచి రింగ్ చేయటం మొదలుపెట్టాము.

ఎనిమిది అర్థరూపాయ బిళ్ళలు మింగాక అప్పుడు అందమయిన ఓ గొంతు ప్రేమగా మాట్లాడింది.

"దయచేసి మీ ధ్యానం ఇట్లు మళ్ళీంచండి! ఫోన్ అవుటాఫ్ ఆర్డర్‌లో యున్నదని తెలియజేయటానికి చింతిస్తున్నాం. మా టెలిఫోన్స్ డిపార్ట్‌మెంట్ సదా మీకు సేవ చేస్తుందని తెలియజేయటానికి సంతోషిస్తూ మీకు మా నూతన సంవత్సరాభినందనలు తెలియజేస్తున్నాము.

తక్కున ఫోన్ డిస్కనెక్ట్ చేసేశాను.

"ఏం జరిగింది? ఇంక మన దగ్గర అర్ధరూపాయ్ కాయిన్స్ కూడా లేవు" అన్నాడు శాయిరామ్ ఆందోళనగా.

"ఫోన్ అవుటాఫ్ ఆర్డరట."

"ఎవరిది?"

"ఏమో? అది తెలీదు–"

"బహుశా మనదే అయుంటుంది. అందుకే ఎనిమిది అర్ధరూపాయలు మింగింది" కోపంగా అన్నాడు జనార్ధన్.

"ఇప్పుడేం చేద్దాం మరి?"

"మనమే వెళ్దాం - కంట్రోల్ రూమ్‌కి" అన్నాడు యాదగిరి.

అందరం ఆటోలో కంట్రోల్ రూమ్‌కి బయలుదేరాం.

టీ.వీ.టవర్ దగ్గర కొచ్చేసరికి హఠాత్తుగా పెద్ద విజిల్స్‌తో ఇద్దరు పోలీసులు ఆటోకి అడ్డంగా వచ్చేశారు.

"రోకో– రోకో" అని అరచాడొక కానిస్టేబుల్.

ఆటోవాడు సడన్ బ్రేకులతో ఆటో ఆపేప్పటికి, మా ఆటో వెనుకనే వేగంగా వస్తోన్న జనార్ధన్ వాళ్ళ ఆటో మా మా ఆటోని డాష్ ఇచ్చేసింది.

జనార్ధన్ మొఖం మీటర్ బోర్డ్‌కి కొట్టుకుని అప్పటికప్పుడే మొఖం వాచిపోయింది. అందరం కోపంగా ఆటో దిగాము.

"ఏమిటి? ఎందుకాపారు?" శాయిరామ్ కోపంగా అడిగాడు కానిస్టేబుల్స్‌ని.

"హమారే సాబ్‌కే పాస్ జావ్" అన్నాడు కానిస్టేబుల్– లాఠీతో దూరంగా రోడ్ ప్రక్కకు లైటు స్తంభం కింద దొంగలాగా నక్కి నిలబడ్డ వాళ్ళ ఇన్‌స్పెక్టర్‌ని చూపుతూ.

అందరం ఇన్‌స్పెక్టర్ దగ్గరకు నడిచాము.

"మమ్మల్ని ఎందుకండీ ఆపారు" అడిగాడు శాయిరామ్.

ఇన్‌స్పెక్టర్ చిరాగ్గా చూసాడు మావేపు.

"ఎవరు మీరంతా."

"నిర్భయ్‌నగర్ కాలనీ వాళ్ళం!"

"ఎక్కడుందా కాలనీ?"

"అభాగ్యనగర్ కాలనీకి ఎదురుగ్గా"

"అభాగ్యనగర్ కాలనీ ఎక్కడుంది?"

"వెంకటేశ్వర స్వామి గుడి ప్రక్కనే"

"వెంకటేశ్వర స్వామి గుడి ఎక్కడుంది?"

"మోహన్ పబ్లిక్ స్కూలు పక్కనేనండి– మోహన్ పబ్లిక్ స్కూల్ మీకు తెలిసే వుంటుంది.

చాలామంచి స్టాండర్డ్స్ తో రిజల్ట్స్‌తో స్టేట్ ఫస్ట్ వస్తుంటుంది-"

"నేనెప్పుడూ వినలేదా పేరు- ఇంతకూ ఆ స్కూలెక్కడుంది?"

అతనికెలా చెప్పాలో మాకు అర్థం కాలేదు. యాదగిరి ముందుకొచ్చాడు.

"గదేసార్! నర్సింలు గుడంబ దుకాణం పక్కనే ఉన్నది సార్ మా కాలనీ-"

"మరా సంగతి ముందు చెప్పరేం? గుడిపేర్లూ, స్కూలు పేర్లూ చెప్తే ఎవడికి తెలుస్తుంది."

అందరం తప్పయిపోయిందని వప్పుకున్నాం. మనదేశంలో ఎక్కడయినా సరే లాండ్ మార్క్స్ చెప్పాలంటే బార్లు, కల్లు కాంపౌండ్లు, వైన్ షాపుల్ని మించిన లాండ్‌మార్క్‌లు ఉండవు.

"అయితే ఇప్పుడెక్కడికెళ్తున్నారు?"

"పోలీస్ కంట్రోల్ రూమ్‌కండీ"

"ఎందుకు?"

"మా కాలనీ తాలూకా ఓ అమ్మాయి శవం దొరికిందేమో కనుక్కోటానికండీ-" ఇన్‌స్పెక్టర్ ఉలిక్కిపడ్డాడు.

"శవమా?"

"అవునండీ!"

"సూసైడ్ కేసా?"

"కాదండీ! రేప్ అండ్ మర్డర్ అయుంటుందని మా నమ్మకమండీ"

"ఎవరు చంపారు?"

"అది మాకెలా తెలుస్తుందండీ! రాత్రుళ్ళు రోడ్‌మీద తిరిగేది పోలీసులూ, దొంగలూ, గూండాలే కదండీ"

"రాత్రుళ్ళూ, శవం, మర్డర్- ఏమిటయ్యా మీరు మాట్లాడేది? ఇంతకూ ఆ అమ్మాయి ఎవరు?"

"మా కాలనీ అమ్మాయండీ!"

"ఆ అమ్మాయికీ మీకూ ఏమిటి సంబంధం?"

"ఏమీ లేదండీ! జస్ట్ మా కాలనీ అమ్మాయ్ అంతే-"

ఇన్‌స్పెక్టర్ ఓ క్షణం ఆలోచించాడు.

"ఏయ్ ఫోర్ నాట్ ఫోర్"

"యస్సార్-"

"వీళ్ళందరినీ వాన్ ఎక్కించు"

మేము అదిరిపడ్డాము.

"ఎందుకండీ–"

"ఆ పిల్లను మీరే మర్డర్ చేసి శవాన్ని ఎక్కడో పడేసి ఉంటారు. మళ్ళీ ఏమీ తెలీనట్లు వెతకటానికి బయల్దేరారు–"

కానిస్టేబుల్స్ – నలుగురొచ్చి మమ్మల్ని వాన్ వేపు తోయసాగారు.

"మీకేం దమాకున్నాది వయ్యా! నీయవ్వ– మేము ఆ పోరి తల్లిదండ్రులకు మదద్ చేద్దామని పోతూంటే మమ్మల్నే లోపట జేస్తారు?"

యాదగిరి కోపంగా అడిగాడు.

"ఏయ నకరాలు చేయకుబే– ఆవాజ్ బంద్ కర్‌కే వాన్ ఛడో!"

అంటూ లాఠీతో యాదగిరిని ఒక్కతోపు తోసాడు, కానిస్టేబుల్.

లాఠీ చూసేప్పటికి మా అందరికి కూడా భయం కలిగింది. నిశ్శబ్దంగా వాన్ ఎక్కేశాం అందరం.

పోలీస్ స్టేషన్లో ఇంటరాగేషన్ మొదలయింది.

"ఆ సంధ్యారాణి అనే అమ్మాయిని నువ్ లవ్ చేసినావు! కదూ?" శాయీరామ్ నడిగాడు ఇన్‌స్పెక్టర్.

"లవ్వేమిటండీ నా తలకాయ! నాకు పెళ్ళయింది ఇద్దరు పిల్లలు–

"అయినాగానీ ఇంకో అమ్మాయిని – అంటే ఈ సంధ్యారాణిని ప్రేమించి పెళ్ళి చేసుకోవాలనుకున్నావ్! ఆ అమ్మాయితో ఈ విషయం చెప్పావ్! కానీ ఆ అమ్మాయి వప్పుకోలేదు. అందుకని ఆమె మీద కసితో ఏదో సాకుతో ఆమెను ఒంటరి స్థలానికి తీసుకెళ్ళి రేప్ చేసి చంపేసావ్– అవునా?" మొత్తం రహస్యం కనుక్కున్నట్లు విజయగర్వంతో అడిగాడు, సబిన్‌స్పెక్టర్,

"అబద్ధం! ఇదంతా మీ కట్టుకథ! ఉన్న ఒక్క భార్యను కూడా ఎందుకు చేసుకున్నానా, అని పెళ్ళయిన మర్నాటి నుంచీ పశ్చాత్తాపపడుతూంటే నా మొఖానికి ఇంకో పెళ్ళామా?"

"నిజం చెప్పు! దీనికంతటికీ ఏ సినిమా ఇన్‌స్పిరేషన్?"

శాయీరామ్ అయోమయంగా చూసాడు.

"సినిమానా?"

"అవునోయ్! సినిమా! ఏం సినిమా చూశాక రెండో పెళ్ళి చేసుకోవాలన్న ఆలోచన కలిగింది నీకు–"

"నాకేం అర్థం కావటం లేదండీ–"

"ప్రతి నేరానికీ ఈ రోజుల్లో ఏదొక సినిమా ఇన్‌స్పిరేషన్ ఉంటుందని మా అసిస్టెంట్ కమీషనర్ గారి నమ్మకం. అందుకే ప్రతి నేరస్తుడినీ ఏదొక సినిమా పేరు చెప్పమంటున్నాం! అది కంపల్సరీ! తప్పించుకోడానికి వీల్లేదు, లేకపోతే మాకు మాటొస్తుంది. త్వరగా

చెప్పు–"

"ఏం చెప్పమంటారు?"

"నువ్వీ నేరం చేసేందుకు ఏ సినిమా ప్రోత్సాహం కలిగించింది?"

"అయ్యో – అసలు నేను ఏ నేరమూ చేయలేదు– ఇంకా సినిమా ఇన్‌స్పిరేషన్ ఏమిటి సార్? నా తలకాయ"

"ఏయ్! ఏదొక సినిమా పేరు చెప్తావా– లాఠీతో బాదమంటావా?"

శాయీరామ్ కంగారుపడ్డాడు.

"ఏదొక సినిమా పేరు చెప్పెయ్– వీళ్ళతో గొడవెందుకు?" అన్నాన్నేను.

శాయీరామ్ సినిమా పేర్లు ఆలోచించాడు. త్వరత్వరగా.

'చలిచీమలు' అన్నాడు ఠక్కున.

"అదీ సంగతి! అందులో ఓ మగచీమ రెండు ఆడ చీమల్ని ప్రేమించే సీన్ ఉందికదూ?"

"అబ్బే! పేరుకి చలిచీమలు గానీ అందులో మనుషులే యాక్షన్ చేస్తారండీ!"

ఇన్‌స్పెక్టర్ చిరాగ్గా చూసాడు.

"అయితే మరి చలిచీమలు అని పేరెందుకు పెట్టారు?"

"తెలీదండీ–"

"అది చీటింగ్ కింద వస్తుంది. వాళ్ళమీద రేపే కేస్ బుక్ చేయిస్తాను– అయితే నువ్ ఆ సినిమాలో లవ్‌సీన్ చూసి– ఆ ఇస్పిరేషన్‌తో మీ కాలనీ యువతిని ప్రేమించి, ఆమె తిరస్కరించే సరికి రేప్ చేసి మర్డర్‌చేసి, శవాన్ని ఎక్కడోదాచి మళ్ళా ఏమీ ఎరగనట్లు వెతుకుతున్నావ్ అవునా?"

"అంతా అబద్ధం" అన్నాడు శాయీరామ్.

"ముందీ స్టేట్‌మెంట్ మీద సంతకం పెట్టు–"

"నేను ఛస్తే పెట్టను–"

"పెట్టకపోతే బొమికవిరగ్గొడతాను– మిమ్మల్నందర్నీ కూడా శవాలుగా మార్చేస్తాను–" అన్నాడు లాఠీ ఒకటి శాయీరామ్ పొట్టలో గుచ్చుతూ.

శాయిరామ్ భయపడుతూ సంతకం పెట్టాడు. ఆ తర్వాత సంధ్యారాణిని మేమే మర్డర్ చేసినట్లు అందరం స్టేట్‌మెంట్ మీద సంతకాలు చేసాము.– లాఠీతో చావుదెబ్బలు తిన్నాక.

రెండో అమ్మాయిని కూడా పెళ్ళి చేసుకోవాలన్న ఇన్‌స్పిరేషన్ శోభన్‌బాబు తాలూకు సినిమాల వల్ల కలిగినట్లు కూడా వప్పుకుని తలోసినిమా పేరూ రాశాము.

"ఇప్పుడు చెప్పండి– శవాన్ని ఎక్కడ దాచారు?"

అందరికీ ఏడుపొచ్చేసింది.

"నిజంగా చెప్తున్నానండీ! మాకేపాపమూ తెలీదు, కావాలంటే ఆ అమ్మాయి తల్లి దండ్రుల నడగండి! మేమెంత మర్యాదస్తులమో చెప్తారు–"

"అదంతా తర్వాత – ముందు బయటకు నడిచి వాన్ ఎక్కండి. శవాన్ని ఎక్కడ దాచారో చూపిస్తే వదిలేస్తాం–"

"మాకు తెలీదు సార్–"

లాఠీతో వీపులో గుచ్చి బయటకు తోయసాగారు కానిస్టేబుల్స్.

–అందరం వాన్ ఎక్కాం చేసేదిలేక.

వాన్ వేగంగా పరిగెడుతోంది రోడ్‌మీద.

లకడీకాపూల్ వచ్చేసిరికి వాన్ ఆగిపోయింది.

కార్లు, బస్‌లు, లారీలు, స్కూటర్ల హారన్లతో మోతెక్కి పోతోందా ప్రాంతమంతా! ఎక్కడ చూసినా జనం, వాహనాలు– కిటకిటలాడిపోతున్నారు!

హఠాత్తుగా వాళ్ళల్లో నుంచి తోసుకుంటూ రంగారెడ్డి గ్రూప్ వాళ్ళు బయటికొచ్చారు.

వాళ్ళను చూస్తూనే మా ప్రాణం తిరిగి వచ్చినట్లయింది.

"రెడ్డీ" అంటూ గట్టిగా అరిచాము.

వాళ్ళంతా ఆగిపోయి వాన్‌లో నుంచి చేతులూపుతోన్న మమ్మల్ని చూసి పరుగుతో వచ్చారు.

"ఇంక మీరు వెతకనఖ్ఖర్లేదు! దిగి వచ్చేయండి! సంధ్యారాణి గంట క్రితం ఇరానీ హొటల్లో 'టీ' తాగుతూ మన కాలనీ వెంకటేశానికి కనిపించిందట–"

"ఏయ్ నువ్వెవరు?" అడిగాడు రంగారెడ్డిని.

"రంగారెడ్డి – కేరాఫ్ నిర్భయ్‌నగర్ కాలనీ–"

"అయితే నోరు మూసుకుని నీ దారిని నువ్ వెళ్ళు – వాన్‌లో ఉన్న వాళ్ళను దిగమని ఎందుకు చెప్తున్నావ్?"

"వాళ్ళు సంధ్యారాణి కోసం వెతుకుతున్నారు గనుక– ఇంక ఆ అవసరం లేదని చెప్తున్నాము" అన్నాడు గోపాల్రావ్ కల్పించుకుంటూ.

"నువ్వెవరు?" గోపాల్రావ్ వేపు కోపంగా చూస్తూ అడిగాడు.

"గోపాల్రావ్– 'ఈ క్షణం' న్యూస్ పేపర్ జర్నలిస్ట్‌ని! కేరాఫ్ నిర్భయ్‌నగర్ కాలనీ"

ఇన్‌స్పెక్టర్ మొఖంలో రంగులు మారాయ్.

"జర్నలిస్ట్ అయితే పెద్ద పోటుగాడినను కుంటున్నావా? ఫో, ఇక్కడనుంచి!"

"మాటలు మర్యాదగా రానీయండి!" అన్నాడు గోపాల్రావ్.

ఇన్‌స్పెక్టర్‌కి కోపం ఆగలేదు.

"రాస్కెల్! నాకే వార్నింగిస్తున్నావ్ రా నువ్వూ" అంటూ వాన్ దూకి వెళ్ళి గోపాల్రావ్ కాలర్ పట్టుకున్నాడు.

దాంతో జనమంతా హడావుడిగా వాళ్ళ చుట్టూ మూగిపోవటం మొదలు పెట్టారు. ఆ జనాన్ని చూచి మరో పోలీస్ జీప్ వచ్చి ఆగిందక్కడ.

"నా చొక్కా పట్టుకుంటావా? రేపే ఈ ఓణంలో ఈ న్యూస్ ఫోటోతో సహా వేసేస్తాను. నీ అంతు తేల్చేస్తాను–" అరవసాగాడు గోపాల్రావ్–

దాంతో ఇన్స్పెక్టర్‌కి భయం మొదలయింది.

ఈలోగా జీప్ దిగి మరో పోలీస్ అధికారి వచ్చాడు.

"వాటీజ్ ది మేటర్?" అడిగాడు ఇన్స్పెక్టర్‌ని.

అదే అదనని మేమంతా వాన్ దూకి వాళ్ళ దగ్గరకు పరుగెత్తాం. జరిగిందంతా విన్నాడతను.

"అయితే ఆ అమ్మాయి గంటక్రితం ఈ ఏరియాలో కనిపించిందంటారు!"

"అవునండీ–"

"ఒకవేళ మీ మాట అబద్ధమని తేలితే మళ్ళీ మిమ్మల్నందరినీ మూసేస్తాం–"

"అలాగేసార్–"

"ఇంక పొండి–"

మారు మాట్లాడకుండా అందరం కాలనీ వేపు బయల్దేరాము. సంధ్యారాణి ట్రాఫిక్ జాములో ఇరుక్కుపోయిందన్న విషయం కాలనీ అంతా చెప్పేశాం!

"నేను ముందే అనుకున్నా! ఈ రోజుల్లో మన ట్రాఫిక్ పోలీసుల సంఖ్య బాగా పెరిగిపోయింది కదా! అంచేత ట్రాఫిక్ జామ్‌లు కూడా ఖచ్చితంగా పెరిగిపోతాయని" అంది రాజేశ్వరి.

"పెరిగిపోతాయ్ ఏమిటి నా మొఖం! ఈ ఏడు ప్రపంచ ట్రాఫిక్ జామ్స్ పోటీల్లో హైదరాబాద్ నగరం ప్రథమ బహుమతి గెల్చుకుందని మా అన్నయ్య కొడుకు వారం క్రితం అమీర్‌పేట ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కున్నప్పుడు ఓ దినపత్రికలో చదివాడట–" అంది పార్వతీదేవి.

"గెలవక ఛస్తుందా? ట్రాఫిక్ పోలీస్ లెక్కువయిన కొద్దీ అంతేమరి–"

అందరం ట్రాఫిక్ జామ్ కబుర్లలో మునిగిపోయాం.

"మా బాబాయి వాళ్ళిల్లు మీ అందరికీ తెలిసిందే కదా! నారాయణ్ గూడా చౌరాస్తా పక్కనే ఉంది. కిందటి సారి ట్రాఫిక్ జామ్ ఏర్పడినప్పుడు ఆ ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన చాలామందికి రెండు రోజులపాటు తన ఇల్లంతా అద్దెకిచ్చాడాయన. ఈ రెండు రోజుల్లోనే అయిదువేలు ఇన్‌కమ్ వచ్చింది. ఆ తరువాత ఆ యింటిపేరు ట్రాఫిక్‌జామ్ రిలీఫ్ సెంటర్ అని మార్చేశాడు. సంవత్సరం తిరగలేదు– ఒక అంతస్థల్లా ఇప్పుడు దానిమీద

పది అంతస్థులేశాడు– దానిమీద వచ్చిన ఇన్‌కమ్‌తో–" అన్నాడు వెంకట్రావ్.

"అందాకా ఎందుకు? మా శాంతమ్మత్త కూతురిని నెలలు నిండాక డాక్టర్ దగ్గరకు చెకప్‌కి తీసుకెళ్తుంటే ట్రాఫిక్ జామ్‌లో మూడురోజులు గడపాల్సి వచ్చింది. అక్కడే నొప్పులు రావటం వల్ల ఖాళీగా ఉన్న లారీలో పురుడు పోసేశారు–" చెప్పింది సావిత్రమ్మ.

"మన కాలనీ వెనుక వేపున్న శీనుగాడిలాగేగా లక్షాధికారి అయింది? ట్రాఫిక్ జామ్‌లోకి దూసుకెళ్ళిపోయి ఎనిమిది గంటలపాటు వీడియో సినిమాలు వేసి టికెట్ పెట్టాడంట–"

అందరం మాట్లాడుకుంటూండగానే తెల్లారిపోయింది. అయితే ఆ సాయంత్రం వరకూ కూడ సంధ్యారాణి కనిపించకపోయే సరికి మళ్ళీ ఆమె తల్లిదండ్రులు ఏడుపు మొదలెట్టారు–

మేమంతా మళ్ళీ వాళ్ళ దగ్గరకెళ్ళాం.

"ఆమె క్షేమంగా ఉందని తెలసింది కదా! మళ్ళీ ఎందుకు ఏడుస్తున్నారు? అడిగాడు శాయిరామ్.

"అమ్మాయి నిజంగా ట్రాఫిక్‌జామ్‌లో ఉందోలేదో–"

"అదేమిటి? ఆ వెంకటేశం గాడు కనిపించిందని చెప్పాడు కదా!"

"వాడసలే తాగుబోతు! తాగిన నిషాలో– ఎవర్ని చూసి ఎవరనుకున్నాడో ఏమో–"

వెంటనే వెంకటేశాన్ని పిలిపించాము.

"ఏంటి గురూ?" కళ్ళు నులుముకుంటూ తూలుతూ వచ్చాడతను.

"నిన్న రాత్రి నువ్ మాకు లకడీకాపూల్ ట్రాఫిక్‌జామ్‌లో కలిసినప్పుడు నీకు సంధ్యారాణి ఓ హొటల్లో కనిపించిందని చెప్పావ్ కదూ?"

"నిన్న రాత్రా?"

"అవును"

"మీక్కనిపించానా?"

అందరికీ కోపం ముంచుకొచ్చింది.

"అంటే– అప్పుడే మర్చిపోయావా?"

"అరెరె! కోపమెందుకన్నా! కనిపిస్తే కనిపించి ఉండొచ్చు! దానికింత కిరికిరెందుకు?"

"అప్పుడు నీకు సంధ్యారాణి ఓ హొటల్లో కనిపించిందని చెప్పావా లేదా?"

"సంధ్యారాణా?"

"అవునయ్యా! ఇదిగో ఈ రామచంద్రమూర్తిగారమ్మాయ్ సంధ్యారాణి–"

"ఓహో ఆ అమ్మాయా?"

"అవును! ఆ అమ్మాయే!"

"అ అమ్మాయికి నేను కనిపించానని చెప్పిందా?"

"కాదు. నువ్వే ఆ అమ్మాయి కనిపించిందని చెప్పావ్"

"ఎక్కడ?"

"హెూటల్లో"

"ఏ హెూటల్లో"

"ఇరానీ హెూటల్లో"

అతను కొద్ది క్షణాలు ఆలోచించాడు.

"ఎవరా అమ్మాయ్?"

మాకు ఇంక కోపం ఆగలేదు.

"సంధ్యారాణి–" పళ్ళు బిగపట్టి అరచాడు రంగారెడ్డి.

"నేను చెప్పలేదు– అసలు నేను నిన్నరాత్రి లకడీకాపూలే వెళ్ళలేదు–"

"అదేమిటోయ్– నువ్ ఆ ట్రాఫిక్ జామ్‌లోనుంచి నీ సైకిల్ నెత్తిన పెట్టుకుని ఆరుగంటల పాటు జనాన్ని ఈదుకుంటూ బయటికొచ్చానని మాతో చెప్పలేదూ?"

"మీతోనా?"

"అవును."

"నిన్న రాత్రా?"

"అవును–"

"అసలు మిమ్మల్ని నేను చూసి నెలరోజులయింది. ఆడెవడో మన కాలనీ రైటర్ నవలొకటి పబ్లిష్ చేస్తున్నాం చందాలివ్వమని ఆడగటానికి వచ్చినప్పుడు కలుసుకున్నాను–"

యాదగిరి ఇంక సహించలేక అతనిని గట్టిగా ఒక్కతోపు తోశాడు. అతను కింద పడుతూనే గురక పెట్టి నిద్రపోసాగాడు.

"పదండి– మళ్ళా వెళ్ళి ఆ ట్రాఫిక్ జామ్‌లోనే వెదుకుదాం" అన్నాడు రంగారెడ్డి.

అందరం మళ్ళీ బయల్దేరాం.

కోటీవరకూ వెళ్లామో లేదో మొత్తం ట్రాఫిక్ జామ్ అయిపోయి కనిపిచింది. ట్రాఫిక్ పోలీసులు సరదాగా అరగంటకోసారి విజిల్స్ ఊదుతూ మళ్ళీ కబుర్లు చెప్పుకుంటూ నిలబడి ఉన్నారు.

మేమంతా ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ దగ్గరకు నడిచాము.

"ఇవాళ కొంచెం ఎక్కువగా జామ్ అయినట్లుంది కదండీ! కానిస్టేబుల్ గారూ?" అడిగాను నేను.

"అవ్" అన్నాడు కానిస్టేబుల్.

"కానీ రోజూ సాయంత్రం అయిదుగంటలకు ఈ ఏరియాలో ట్రాఫిక్ జామ్ అయేదికదా! ఇవాళ మూడింటికే జామయిపోయిందే?" అడిగాడు గోపాల్రావ్.

"ఇది ఈవాల్టిది కాదువయ్యా! నిన్నటి ట్రాఫిక్‌జామే. ఇంకా క్లియర్‌కాలేదు. ఇవాల్టిది ఇంకాసేపట్లో మొదలువుతంది" వివరంగా చెప్పాడతను.

"అసలు ఈ ట్రాఫిక్‌జామ్‌లు మీరివాళ ఎందకు ఏర్పాటు చేస్తున్నట్లు?" ఆ పక్కనే ఉన్న ఇన్‌స్పెక్టర్ దగ్గరకెళ్ళి అడిగాడు గోపాల్రావ్.

ఇన్‌స్పెక్టర్‌కి కోపం ముచుకొచ్చింది.

"ఎవర్నువ్వు? నీ నెత్తిమీద హెల్మెట్ ఏదీ? వందరూపాయలు ఫైన్ కట్టు–"

గోపాల్రావ్ క్కూడా కోపం వచ్చేసింది.

"ప్రెస్" అన్నాడు అయిడెంటిఫికేషన్ చూపిస్తూ!

"ఓ! అలాగా! ట్రాఫిక్ జామ్‌లు ఎందుకు ఏర్పాటు చేశారని అడిగింది మీరే కదూ?"

"అవును–"

"ఎందుకేమిటయ్యా! ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా గారొస్తున్నది ఎల్లుండేకదా? మీ పేపర్లో చదవలేదా?"

"కానీ ఎల్లుండి వస్తూంటే ఇవాళే ట్రాఫిక్ జామ్ ఎందుకు ఏర్పాటు చేశారు?" అడిగాడు శాయిరామ్.

"మీకేం మతుందా లేదా? అప్పటికప్పుడు సడెన్‌గా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పాటు చేసుకోవాలంటే మాటలేమిటి? కనీసం రెండు రోజుల ముందునుంచే ప్రాక్టీస్ చేయాలి. లేకపోతే తీరా ప్రెసిడెంట్ వచ్చినప్పుడు ట్రాఫిక్ అంతా స్మూత్‌గా వెళ్ళిపోతే బాధ్యత ఎవరిది? మీదా? మాదా? న్యూస్ పేపర్లన్నీ దుమ్మెత్తిపోస్తాయ్– మా డిపార్ట్‌మెంట్ మీద ప్రెసిడెంట్ అంతటివాడు హైదరాబాద్ వస్తే ఒక్కచోట కూడా ట్రాఫిక్ జామ్స్ లేవని! అవునా కాదా?"

"అవునవును" అన్నాడు జనార్ధన్.

"మరో రెండు గంటలు మేము ఆ ట్రాఫిక్ జామ్‌లో నుంచి ముందుకెళ్ళటానికి ప్రయత్నించి, చేతకాక చివరకు వెనక్కు తిరిగాము. అయితే అప్పటికే మా వెనుక కూడా ట్రాఫిక్ జామ్ అయిపోవడం వల్ల మరో రెండుగంటలు తన్నుకుని ఎలాగయితేనేం రాత్రికి మళ్ళీ కాలనీకి చేరుకున్నాం. అప్పటికే సంధ్యాఆరాణి తల్లిదండ్రులు ఏడ్చి ఏడ్చి అలసిపోయి ఏడవటం మానేశారు. లకడీకాపూల్ వెళ్ళటానికి రింగ్‌రోడ్డు ఉప్పల్ మీదుగా మరోదారి ఉందన్న విషయం తెలిసి అప్పటికప్పుడే రెడీ అయ్యాము గానీ తీరా ఆఖరి క్షణంలో శాయిరామ్ అడ్డుపడ్డారు.

"ట్రాఫిక్ జామ్స్ ప్రతి ఏరియాలోనూ ఒకో టైమింగ్స్‌ని బట్టి ఏర్పాటు చేస్తుంటారు పోలీసులు. కనుక ఈ దారిలో ట్రాఫిక్ జామ్స్ ఏయే టైమింగ్‌లో మెయింటెయిన్ చేస్తూంటారో పోలీస్ స్టేషన్స్‌కి ఫోన్ చేసి కనుక్కుని దాని ప్రకారం మనం వెళ్ళటం మంచిది" అన్నాడతను.

"వెంటనే మళ్ళీ అర్ధరూపాయ్ కాయిన్స్ పోగు చేసి వరుసగా అన్ని పోలీస్‌స్టేసన్స్‌కీ ఫోన్ చేస్తూండగా సంధ్యారాణీ, మరో యువకుడూ మెడలో పూలదండలతో ఆటోదిగారు.

అందరం కాసేపు నిశ్చేష్టులమయిపోయి తరువాత పరుగుతో వెళ్ళి వాళ్ళచుట్టూ మూగాము.

"ఏమయిపోయావే నా తల్లీ" అంటూ భోరున ఏడ్చేసింది వాళ్ళమ్మ కౌగలించుకుని.

"నేనేమయిపోతాను మీ పిచ్చిగానీ– గత సంవత్సరంగా నేను బస్‌లో ఆఫీస్‌కెళ్ళి వస్తున్నాను కదా. రోజూ లకడీకాపూల్ ట్రాఫిక్ జామ్‌లో అయిదారు గంటలపాటు మా బస్ ఇరుక్కుపోవటం మామూలే కదా! రోజూ మా బస్ పక్క బస్‌లో – ఇదిగో– ఇతను కూడా అదే ట్రాఫిక్ జామ్‌లో ఉంటూండేవాడు. ఇద్దరం పక్కపక్క బస్సుల్లో ఎదురెదురు కిటికీల దగ్గర సీట్లల్లో కూర్చోవడం వల్లఇద్దరం 'హలో' అనుకున్నాము. క్రమేపీ కబుర్లలోకి దిగిపోవటం అలవాటయింది. మొన్నటిది మరీ లాంగెస్ట్ ట్రాఫిక్ జామ్ అవటం వల్ల కబుర్లు చెప్పుకుని చెప్పుకుని ఇంక చెప్పుకునేందుకు ఏమీలేక ప్రేమలో పడ్డాము. ఎంత ప్రేమయినా ఎక్కువసేపు చూసుకుంటూ కూర్చుంటే బావుండదు కదా! అందుకని పెళ్లి చేసుకుంటే బావుంటుందని నిర్ణయించుకున్నాం. పెళ్లి అయితే ట్రాఫిక్ జామ్‌లో ఎంతసేపున్నా ప్రాబ్లమ్ వుండదు కదా! ఇంట్లో చేసే కాపురం– రోడ్‌మీదే చేయవచ్చు– మా గొడవంతా చూపి మిగతా పాసింజర్లందరూ జాలిపడి ఆ పక్కనే ఉన్న పూలదుకాణంలో దండలు తెచ్చిచ్చి పెళ్లి జరిపించారు. ఎక్కడో పెళ్ళి పౌరోహిత్యానికి వెళ్ళాల్సిన పురోహితుడొకాయన కూడా అదే బస్‌లో ఉండడం చేత బస్‌లోనే ఘనంగా పెళ్లి జరిగిపోయింది.

పాసింజర్ అందరూ పాపం కూడబలుక్కుని ఓ బస్ అంతా ఖాళీచేసి మాకిచ్చి మొదటిరాత్రి ఆనందంగా గడపమని ఆశీర్వదించారు. మూడు నిద్రలు అయాక – ఇదిగో– ఇప్పుడే వస్తున్నాం–"

ఆమె తల్లిదండ్రుల మొఖంలో ఆనందం నిండిపోయింది.

"ఆ! కట్నం లేకుండా అల్లుడు దొరికాడా? ఏమండీ! వెంటనే లకడీకాపూల్‌కెళ్ళి ఆ ఏరియా ట్రాఫిక్ కానిస్టేబుల్స్ ఫోటోలన్నీ తీసుకురండి. వాళ్ళు మనపాలిట ఇలవేలుపులండీ! వాళ్ళ ఫోటోలను రోజూ మన దేవుడిగదిలో ఉంచి పూజలు చేయాలి! ఎంతోకాలం నుంచీ కట్నాలబాధ వలన చేయలేకపోయిన అమ్మాయి పెళ్ళి కేవలం వాళ్ళ ట్రాఫిక్ జామ్లు పుణ్యమా అని ఎంత చవకగా అయిపోయిందో చూశారా?"

అంటూ భర్తను కౌగిలించుకుంది హ్యాపీగా.

రామచంద్రమూర్తి అప్పటికప్పుడే ఫోటోలు తేవటానికని "యాషికా కెమెరా అరువు తీసుకుని లకడీకాపూల్ వెళ్లిపోయాడు.

ఆ సాయంత్రం కాలనీలో పెద్ద ఎత్తున ట్రాఫిక్ కానిస్టేబుల్స్ ఫోటోలకు పూజలు, ప్రార్థనలు జరుగుతూంటే మేమంతా ఆనందంగా ప్రసాదం తినసాగాము.

"నిజంగానే ట్రాఫిక్ జామ్స్ వలన ఎన్నో లాభాలున్నాయేమో అని నాకు అనిపిస్తుంది." అన్నాడు రంగారెడ్డి అనుమానంగా.

అందరం ఆశ్చర్యపోయాం.

"ట్రాఫిక్ జామ్స్ వల్ల లాభాలా?" రంగారెడ్డిని పిచ్చాడిని చూసినట్లు చూస్తూ అడిగాడు జనార్ధన్.

"అవును! అలా ఓవర్‌గా ఎక్స్‌ప్రెషన్‌లు ఇవ్వకుండా మీరూ బ్రెయిన్ ఉపయోగించి ఆలోచించండి! బోలెడు లాభాలు కనబడతాయ్. అసలు నన్నడిగితే మిగతా అన్ని రాష్ట్రాల వాళ్ళూ మన రాష్ట్ర రాజకీయ నాయకుల దగ్గరా, మన రాజధాని పోలీస్ అధికారుల దగ్గరా శిక్షణ తీసుకోవాలి. అప్పుడు దేశమంతా హైదరాబాద్ మోడల్ ట్రాఫిక్ జామ్స్ ఏర్పాటు చేసుకుని అద్భుతమయిన లాభాలు ఎంజాయ్ చేయవచ్చు–" సీరియస్‌గా అన్నాడతను.

దాంతో అందరూ నిజంగానే ఆలోచనలో పడ్డారు. ముందు యాదగిరికే ఫ్లాష్ వెలిగింది.

"అవ్! రంగారెడ్డి కరెక్ట్‌గా జెప్పిండు! నేను అబ్జర్వ్ జేస్తనే ఉన్నా కదా! ట్రాఫిక్ జామ్స్ ఉండెడిది రోడ్స్‌లో అస్కల్కి ఒక్క యాక్సిడెంట్ కూడా అవటం లేదన్నా! ఎందుకో ఎరికనా? మోటార్‌సైకిల్ గానీ, కారుగానీ అస్సలు ముంగటికి కదుల్తే గదా యాక్సిడెంట్ అవ్వనికి" అన్నాడు కొత్తగా ఏదో డిస్కవర్ చేసినంత ఉత్తేజంతో–

"దానికంటే పెద్ద లాభం ఇంకోటుంది బ్రదర్" అన్నాడు గోపాల్రావ్.

అందరూ అతని వేపు ఆసక్తితో చూశారు.

"ఏమిటది?" అడిగాన్నేను.

"మత కలహాలకు మనదేశం చాలా ప్రసిద్ధికదా! ప్రపంచమంతా మనదేశం గురించి చెప్పుకుని నవ్వుకుంటూనే ఉంటారు. ఇప్పుడీ ట్రాఫిక్ జామ్స్‌ల వల్ల మతకల్లోలాలు, గ్రూప్ ఫైటింగ్‌లు, కులపోరాటాలు అస్సలుండవ్! ఎందుకంటే జనమంతా మన ఇరుకు వీధుల్లో ఇంకా ఇరుక్కుని నిలబడటం వల్ల పక్కవాడిని పొడిచేంత స్థలం కూడా దొరకదు. దాంతో పొడుచుకోడాలు, కాల్చుకోడాలు ఏమాత్రం సాధ్యపడదు. దాంతో ఆటోమేటిగ్గా "భాయి భాయి" లెవల్లో కల్సిపోయి ఐకమత్యంతో ఆ ట్రాఫిక్‌జామ్ నుంచి ఎలా బయటపడాలా అనే ఆలోచిస్తారు–"

"మూడోది దేశంలో వరకట్నాల సమస్య పూర్తిగా రూపు మాసిపోతుంది" అంది రాజేశ్వరి

"ఎలా?" లేడీస్‌లో నుంచి ఎవరో అరచారు.

"ఎలాగేముంది? ట్రాఫిక్ జామ్స్ అన్నాక గంటల తరబడీ, ఒకోసారి విదేశీ ప్రముఖులు మన రాష్ట్రానికొచ్చినప్పుడు – రోజుల తరబడీ ట్రాఫిక్ జామ్స్ అవుతాయ్ కదా! అప్పుడు ఆ ట్రాఫిక్ జామ్స్‌లో పెళ్ళి కాని యువతీ యువకులు కూడా ఇరుక్కోక తప్పదు కదా! దాంతో గత్యంతరం లేక టైమ్‌పాస్ కోసమయినా ఒకరినొకరు పలుకరించుకోవటం, జీవితం గురించి వేదాంత ధోరణిలో మాట్లాడుకోవటం, ఒకరి గురించి ఒకరు తెలుసుకోవటం– ఆ తరువాత ప్రేమలో పడటం– ట్రాఫిక్ జామ్ క్లియర్ అవగానే పెళ్ళి చేసేసుకోవాలిని నిర్ణయించుకోవటం– అలా లవ్ మారేజీలు పెరిగిపోతాయ్. దాంతో వరకట్నా సమస్యమ ఆటోమేటిగ్గా పరిష్కారమయిపోతుంది–" ఆవేశంగా చెప్పిందామె.

కొంతమంది లేడీస్ తప్పట్లు కొట్టారు ఆనందంగా.

"ఆ రోజుల త్వరగా రావాలి!" అని కూడా అరచారు వాళ్ళు.

"వీటికన్నికంటే కూడా గొప్పలాభం ఇంకోటుంది" అంది పార్వతీదేవి.

"ఏమిటది?"

"ట్రాఫిక్ జామ్స్ ఇలాగే విజయవంతంగా అమలుపరుస్తే మనదేశంలో ఆహారకొరత వెంటనే తగ్గిపోతుంది. ఎందుకంటే కొన్ని లక్షలమంది ట్రాఫిక్ జామ్స్‌లో ఇరుక్కుపోయి కనీసం రెండురోజులకో పూటయినా భోజనం మిస్ అవుతారు. ఆ విధంగా కొన్ని లక్షల టన్నుల ఆహారధాన్యాలు మిగిలిపోతాయ్–"

"నన్నడిగితే దానికన్నా కూడా మంచిలాభం ఇంకోటుంది. అదేంటంటే రైళ్ళల్లో, బస్సుల్లో, టాక్సీల్లో రద్దీ డ్రాస్టిక్‌గా తగ్గిపోతుంది. ఎంచేతంటే వాటిల్లో వెళ్ళాల్సిన ప్రయాణీకులు కొన్ని లక్షలమంది ట్రాఫిక్ జామ్స్‌లో ఇరుక్కుపోయి టైమ్‌కి స్టేషన్‌గానీ, బస్‌డిపోకి గానీ చేరుకోలేరు– దాంతో వాటిని మిస్ అయిపోయి ప్రయాణం రద్దు చేసుకుంటారు–"

ఓ ముసలాయన ఉత్సాహంగా అందరినీ తోసుకుంటూ ముందుకొచ్చాడు.

"అసలు విషయం మర్చిపోయారర్రా! ఈగలు, దోమల కన్నా ఫాస్ట్‌గా పెరిగిపోతున్న మన జనాభా పెరుగుదల ఈ ట్రాఫిక్ జామ్స్‌ల వల్ల సగానికి సగం పడిపోతుంది–"

అందరూ ఈలలు వేసి తప్పట్లు కొట్టారు.

"సోదరులారా! ఈ ట్రాఫిక్ జామ్స్ వల్ల లాభాలకు అంతు ఉన్నట్లు లేదు. అందుకని ఇంక ఈ టాపిక్ ఆపి ఇళ్ళకు వెళ్తే బాగుంటుంది." అన్నాడు రంగారెడ్డి చిరాకుగా. అందరూ ఇళ్ళకు వెళ్తోంటే రేడియోలో వార్తలు వినబడుతున్నాయ్.

ఆంధ్రప్రదేశ్ పౌరులకు పోలీస్ కమీషనర్ విజ్ఞప్తి!

ఇక నుంచీ వీధుల్లో నడిచిగానీ, వాహనాలలో గానీ వెళ్ళదల్చుకున్న ప్రజలందరూ విధిగా టిఫిన్ కేరియర్‌లో భోజనాలు, తాగడానికి నాలుగులీటర్ల మంచినీళ్ళు, ఒక తలగడ, ఒక దుప్పటి తీసుకెళ్ళాల్సిందింగా కోరుతున్నారు! స్టేట్ గవర్నమెంట్ ఉద్యోగులు తమతో పాటు ఆఫీస్ ఫైల్స్ కూడా తీసుకెళ్ళి ట్రాఫిక్ జామ్స్‌లో ఆ ఫైల్స్ తాలూకు పని అంతా పూర్తి చేయాల్సిందిగా చీఫ్ సెక్రటరీ ఆదేశిస్తున్నారు. ఆర్టీసీ డ్రైవర్లు ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కున్న వెంటనే డ్యూటీ దిగిపోయినట్లు సంతకం చేసి, బస్‌లోనే నిద్రపోయి తిరిగి ట్రాఫిక్ జామ్ క్లియరయిపోయినప్పుడు మళ్ళీ డ్యూటీలో చేరాల్సిందిగా జనరల్ మేనేజరుగారు కోరుతున్నారు..."

ఆ తరువాత ఇంకేమేం విజ్ఞప్తులు, ఎవరెవరు చేశారో మాకు తెలీదు. అందరం నిద్రలోకి జారిపోయాం.